## క్లుప్తంగా

### జీఓ 85 రద్దు చేయాలి



ఎమ్మెల్యే లోకం నాగమాధవికి వినతిపత్రం అందిస్తున్న ప్రభుత్వ వైద్యులు సాయిరామ్, అనిల్

నెల్లిమర్ల రూరల్: పీజీ ప్రవేశాల్లో ప్రభుత్వ వైద్యుల ఇన్‌సర్వీస్ కోటాను తగ్గిస్తూ విడుదల చేసిన జీఓ 85ను వెనక్కి తీసుకోవాలని వైద్యులు కోరారు. ఈ మేరకు ఒమ్మి గ్రామంలో ఎమ్మెల్యే లోకం నాగమాధవిని గురువారం కలిసి వినతిపత్రం సమర్పించారు. గతంలో ఉండేలా పీజీలో ప్రవేశాలకు ఇన్‌సర్వీస్ కోటాను ఉంచాలని కోరారు. దీనికి ఎమ్మెల్యే స్పందిస్తూ, సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సతివాడ పీహెచ్‌సీ వైద్యాధికారులు సాయిరామ్, అనిల్ పాల్గొన్నారు.

### మర్యాదపూర్వక కలయిక



కలెక్టర్ అంబేడ్కర్‌ను సత్కరిస్తున్న ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జయచంద్రనాయుడు

విజయనగరం ఫోర్ట్ : ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎం. జయచంద్రనాయుడు గురువారం స్థానిక కలెక్టర్ బంగ్లాలో కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ను సత్కరించారు. కార్యక్రమంలో ఐఎంఏ ప్రతినిధులు డాక్టర్ వీఎస్ ప్రసాద్, డాక్టర్ కార్తీక్, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ రవీంద్రనాథ్ పాల్గొన్నారు.

### విద్యార్థులకు నేత్ర పరీక్షలు



విద్యార్థులకు నేత్ర పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ మురళీకృష్ణ

విజయనగరం : నగరంలోని అయ్యప్పనగర్ ఏపీ మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు గురువారం నేత్ర పరీక్షలు నిర్వహించారు. స్కూల్ హెల్త్ ఐ స్క్రీనింగ్ కార్యక్రమంలో భాగంగా జిల్లా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మూడు నెలల పాటు ఈ పరీక్షలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా మోడల్ స్కూల్లో చదువుతున్న మొత్తం 653 విద్యార్థులకు రెండు రోజుల పాటు నేత్ర పరీక్షలు నిర్వహించనున్నట్లు వైద్యాధికారులు తెలిపారు. అవసరమైన వారికి మందులు, కళ్లద్దాలు అందజేస్తామని డాక్టర్ టి. మురళీకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రుక్సానా పర్విన్, ఆశావర్కర్లు వై.రాజేశ్వరి, ఎస్. లలితకుమారి, తదితరులు పాల్గొన్నారు.

### భద్రతా లోపాలే కారణం

విజయనగరం ఫూల్‌బాగ్: జంషెడ్‌పూర్ రైలు ప్రమాదానికి భద్రతలో లోపాలే కారణమని డీవైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ సీహెచ్ హరీష్ గురువారం ఒక ప్రకటనలో ఆరోపించారు. ఈ మేరకు ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

### ఏసీడీపీఓపై విచారణ

పూసపాటిరేగ : భోగాపురం ఐసీడీఎస్ సెక్టార్ పరిధిలో పనిచేస్తున్న ఏసీడీపీఓ బి. తవిటినాయుడుపై అంగన్‌వాడీ కార్యకర్తలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఐసీడీఎస్ విశాఖ రీజియన్ జాయింట్ డైరెక్టర్ చిన్మయదేవి భోగాపురం ఐసీడీఎస్ కార్యాలయంలో గురువారం విచారణ నిర్వహించారు. ఏసీడీపీఓ తవిటినాయుడు తమను దుర్భాషలాడుతూ, మానసికంగా వేధిస్తున్నారని అంగన్‌వాడీ కార్యకర్తలు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో జె.డి చిన్మయిదేవి విచారణ చేపట్టి.. ఫిర్యాదుదారులు, ఏసీడీపీఓ నుంచి వేర్వేరుగా స్టేట్‌మెంట్లను రికార్డ్ చేశారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తానని చెప్పారు. కార్యక్రమంలో ఫిర్యాదుదారులు ఎం.కృష్ణవేణి, కె.వరలక్ష్మి, బి.శారద, ఎం.స్వప్న, పి. సుగుణ, జి. శిరీష, పి. దుర్గాభవానీ, ఎస్.సరస్వతి, టి.చంద్రవేణి, ఎ. పార్వతి, జి.రాములమ్మ, ఎం. అరుణజ్యోతి, చిన్నమ్ములు, బి. అప్పలనర్సమ్మ, ఆర్. అప్పయ్యమ్మ, ఏసీడీపీఓ తవిటినాయుడు, తదితరులు పాల్గొన్నారు.



# వారొచ్చే వరకు వేచి ఉండాల్సిందే...

- గాడి తప్పుతున్న పింఛన్ల పంపిణీ ప్రక్రియ
- లబ్ధిదారులకు తప్పని ఇబ్బందులు



కార్పొరేషన్ పరిధిలో పింఛన్ల పంపిణీని పర్యవేక్షిస్తున్న కమిషనర్ మల్లయ్యనాయుడు

విజయనగరం: ప్రభుత్వం ప్రతి నెలా పంపిణీ చేసే వికలాంగ, వయోవృద్ధుల, వితంతు పింఛన్ల పంపిణీ ప్రక్రియ గాడి తప్పుతోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో వలంటీర్ల ద్వారా ఉదయం 5 గంటలకే ఇంటింటికీ వెళ్లి పింఛన్లు పంపిణీ చేయగా.. ప్రస్తుత కూటమి ప్రభుత్వ హయాంలో లబ్ధిదారులు పింఛన్లు అందజేసే సచివాలయ కార్యదర్శుల కోసం వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గురువారం ఉదయం పింఛన్ల పంపిణీ ప్రక్రియ చేపట్టగా... జొన్నగుడ్డి ప్రాంతంలో పింఛను నగదు అందజేసే సచివాలయ కార్యదర్శి కోసం లబ్ధిదారులు ఆశగా ఎదురుచూడాల్సి వచ్చింది. అదేవిధంగా దాసన్నపేట ప్రాంతంలో పింఛన్లు పంపిణీ చేసేందుకు వచ్చే సచివాలయ కార్యదర్శుల కోసం ముసలివాళ్లు గంటల తరబడి వేచి చూశారు. నగరంలో దాదాపు అన్ని ప్రాంతాల్లో ఇదే తరహా పరిస్థితి నెలకొనగా... తమ పింఛన్ మొత్తం ఎక్కడ అందకుండా పోతుందోనన్న ఆందోళనతో లబ్ధిదారులు సచివాలయ కార్యదర్శులు ఏ ప్రాంతంలో ఉన్నారో తెలుసుకునేందుకు వీధులు వెంబడి తిరగటం గమనార్హం.

**కార్పొరేషన్ పరిధిలో 97.66 శాతం పింఛన్ల పంపిణీ**

విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మొదటి రోజు 97.66 శాతం మందికి పింఛన్లు అందజేసినట్లు కమిషనర్ ఎం. మల్లయ్యనాయుడు తెలిపారు. ఉదయం ఐదు గంటల నుంచి ప్రారంభమైన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. నగరంలో మొత్తం 23,207 మంది పింఛన్‌దారులు ఉండగా, వారిలో 22,664 మందికి పింఛన్లు అందజేశారు. జాయింట్ కలెక్టర్ కార్తీక్ కూడా నగరంలో జరుగుతున్న పింఛన్ పంపిణీ ప్రక్రియను పరిశీలించారు.

# ప్రజలను ఇబ్బంది పెట్టవద్దు..

- ఎమ్మెల్యే లోకం నాగమాధవి



ఎమ్మెల్యే లోకం నాగమాధవి, టీడీపీ ఇన్‌చార్జ్ బంగార్రాజు, రామచంద్రపేట గ్రామస్తులతో సమావేశం నిర్వహిస్తున్న ఆర్డీఓ సూర్యకళ

భోగాపురం: ప్రజలకు ఇబ్బంది కలిగే పనులు చేయవద్దని ఎమ్మెల్యే లోకం నాగమాధవి ఆర్డీఓ సూర్యకళను కోరారు. భోగాపురం విమానాశ్రయ నిర్మాణానికి అవసరమైన మెటల్, పిక్కకు సంబంధించి మండలంలోని రామచంద్రపేట గ్రామానికి సమీపంలో కొంగవాని రెవెన్యూ పరిధిలోని మూడెకరాల కొండపై క్వారీపై జీఎంఆర్, ఎల్అండ్‌టీ సంస్థ ప్రభుత్వానికి దరఖాస్తుకోగానే అనుమతులు మంజూరు చేసింది. అయితే రామచంద్రపేట, కొండ్రాజుపాలెం గ్రామస్తులు తమ గ్రామాలకు సమీపంలో క్వారీ ఏర్పాటు చేయవద్దంటూ పలుమార్లు అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. దీనిపై ఆర్డీఓ సూర్యకళ గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో స్థానిక ఎమ్మెల్యే లోకం నాగమాధవి, టీడీపీ ఇన్‌చార్జ్ కర్రోతు బంగార్రాజు, ఆయా గ్రామస్తులతో క్వారీపై ఏర్పాటుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే నాగమాధవి మాట్లాడుతూ.. ఇప్పటికే రెండు గ్రామాల సమీపంలో చాలా క్వారీలు ఉన్నాయని, వాటివల్ల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ముఖ్యంగా బాంబ్ బ్లాస్టింగ్ చేసే సమయాల్లో ఇళ్ల పెచ్చులు ఉడడంతో పాటు గోడలకు బీటలేర్పడుతున్నాయని చెప్పారు. పాఠశాలకు సమీపంలో ఉన్న క్వారీల్లో బాంబ్ బ్లాస్టింగ్ సమయంలో వచ్చే శబ్దానికి విద్యార్థులు, ఉపాధ్యాయులు భయభ్రాంతులకు గురవుతున్నారని తెలిపారు. క్వారీకి ఇచ్చిన అనుమతులను వెంటనే రద్దు చేయాలని కోరారు. అవసరమైతే ఈ సమస్యను సీఎం పేషీకి దృష్టికి తీసుకువెళ్తానని ఆర్డీఓకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేష్, నీలాపు అప్పలరామిరెడ్డి, కొరాడ తాతారావు, కోలా రామసూరి, దుక్క శ్రీను, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఆధునిక సాగుపై రైతుల మొగ్గు

- వ్యవసాయశాఖ ఏడీఏ నాగభూషణం



వెద పద్ధతిలో వేసిన వరి సాగును పరిశీలిస్తున్న ఏడీఏ నాగభూషణం, వ్యవసాయాధికారులు, సిబ్బంది

డెంకాడ: రైతులు ఆధునిక పద్ధతుల్లో వరి సాగు చేసేందుకు మొగ్గు చూపుతున్నారని వ్యవసాయశాఖ విజయనగరం ఏడీఏ ఎ. నాగభూషణం అన్నారు. మండలంలోని సింగవరం, డెంకాడ గ్రామాల్లో గురువారం ఆయన పర్యటించి వరి వెద, యాంత్రీకరణ పద్ధతుల్లో సాగు చేస్తున్న వరి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మండలంలో 1520 ఎకరాల్లో వెద పద్ధతిలో వరి సాగు చేస్తున్నారన్నారు. మరో 155 ఎకరాల్లో యంత్రాల సహాయంతో ఊబాలు వేశారని చెప్పారు. అలాగే డ్రమ్‌సీడర్ విధానంలో 80 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారని తెలిపారు. వెద పద్ధతిలో యంత్ర సహాయంతో వరి సాగు చేసిన కరక రమణమూర్తి పొలాన్ని సందర్శించారు. ఈ పొలంలో ఒక చదరపు మీటర్‌లో 33 కుదుర్లు రావడాన్ని గమనించారు. దీంతో మంచి దిగుబడి వస్తుందన్నారు. ఆధునిక, యాంత్రీకరణ పద్ధతుల్లో పంటల సాగు వల్ల ఖర్చు బాగా తగ్గుతుందని చెప్పారు. 15 నుంచి 25 రోజుల వరి నారును ఊబాలు చేస్తే వరి పిలకల సంఖ్య కూడా బాగా పెరిగి, అధిక దిగుబడి వస్తుందన్నారు. ఒక క్రమ పద్ధతి ప్రకారం ఊబాలు చేయడం వల్ల ఈనిక ఒకేసారి జరుగుతుందని. దీంతో పొల్లు శాతం కూడా చాలా తక్కువగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో డెంకాడ, పూసపాటిరేగ వ్యవసాయాధికారులు పి.నిర్మల, నీలిమ, ఏఈఓలు రామకోటి, ప్రశాంతి, వీఏఏ కిరణ్మయి, రైతులు పాల్గొన్నారు.

### కుష్టు రోగులకు వైద్యసేవలు



కుష్టు వార్డును పరిశీలిస్తున్న కేంద్ర బృంద సభ్యులు వీరకుమారన్, కుమారేషన్

విజయనగరం ఫోర్ట్: కుష్టు రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కేంద్ర బృందం సభ్యుడు, జాతీయ కుష్టు నివారణ శాఖ డైరెక్టర్ డాక్టర్ ఆర్. వీరకుమారన్, పబ్లిక్ హెల్త్ స్పెషలిస్ట్ డాక్టర్ కె. కుమారేషన్ అన్నారు. గురువారం సాయంత్రం స్థానిక వైద్యారోగ్యశాఖ కార్యాలయం ఆవరణలో ఉన్న లెప్రసీ వార్డును పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంతమంది రోగులు చికిత్స పొందుతున్నారు.. అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. కార్యక్రమంలో కుష్టు నివారణ శాఖ రాష్ట్ర సంయుక్త సంచాలకుడు దయాసాగర్, జిల్లా కుష్టు, హెచ్ఐవీ నివారణ అధికారి డాక్టర్ కె. రాణి, డాక్టర్ దేదీప్య, డీపీఎంఓ దుర్గాప్రసాద్, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నెల్లిమర్ల రూరల్: మండలంలోని తంగుడుబిల్లి 11 కేవీ రూరల్ ఫీడర్ పరిధిలో నిర్వహణ పనులు చేపడుతున్న నేపథ్యంలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఆ శాఖ డీఈఈ పూడి హరి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 3 వరకు రామతీర్థం, దేవుని నెలివాడ గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

### యాజమాన్య పద్ధతులు పాటించాలి



పినతరిమిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ పూర్ణిమ

నెల్లిమర్ల రూరల్: వరి సాగు చేస్తున్న రైతులు యాజమాన్య పద్ధతులను పాటించాలని మండల వ్యవసాయాధికారి పూర్ణిమ సూచించారు. మండలంలోని పినతరిమి గ్రామంలో వరి నారుమడులను గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నారు వేసేటప్పుడు కొనలు తుంచి వేస్తే కాండం తొలిచే పురుగు గుడ్లను నివారించవచ్చన్నారు. నాట్లు వేసినప్పుడు కాలి బాటలు ఉంచితే పైరుకు గాలి, వెలుతురు బాగా తగిలి చీడ,పీడల బెడద ఉండదన్నారు. బీజామృతం, సూడోమోనస్‌తో విత్తనశుద్ధి చేయడం వల్ల పంటను తెగుళ్ల నుంచి కాపాడుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ఏఈఓ నాగరాజు, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

# ఆరుబయట చెత్త వేయొద్దు..

- కార్పొరేషన్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు
- నగరంలోని 3వ డివిజన్‌లో వార్డు పర్యటన



3వ డివిజన్‌లో వార్డు పర్యటన చేస్తున్న కమిషనర్ మల్లయ్యనాయుడు, తదితరులు

విజయనగరం : మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రతిరోజూ ఇంటికి వచ్చే ప్రజారోగ్య విభాగం సిబ్బందికి మాత్రమే చెత్తను అందజేయాలని, అలా కాకుండా ఆరుబయట వేసి పరిసరాలను అపరిశుభ్రం చేసే వారికి అపరాధ రుసుం విధిస్తామని కమిషనర్ ఎం. మల్లయ్యనాయుడు అన్నారు. నగరంలోని 3వ డివిజన్, 3వ నంబర్ సచివాలయం నుంచి గురువారం వార్డుపర్యటన నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆరుబయట చెత్త వేసిన వారిని మందలించారు. ఇకపై వీధులను అపరిశుభ్రం చేస్తే అపరాధ రుసుం విధిస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ, ఎన్నో ఏళ్లుగా నిరుపయోగంగా పడి ఉన్న సామాజిక మరుగుదొడ్లను ప్రజా వినియోగంలోకి తీసుకురావాలని అభ్యర్థించారు. అలాగే పలు ఆక్రమణలను కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. వార్డు పర్యటన అనంతరం కమిషనర్ మల్లయ్యనాయుడు మాట్లాడుతూ.. కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి గురువారం వార్డు పర్యటనలు చేస్తామన్నారు. ఈ పర్యటనలో పలు అంశాలను గుర్తించామని, వాటి పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ తిరుమలరావు, స్థానిక కార్పొరేటర్ వజ్రపు సత్యగౌరి, ఏసీపీ మధుసూదనరావు, ప్రజారోగ్య అధికారి కొండపల్లి సాంబమూర్తి, డీఈలు, ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

### పెన్షన్ల పంపిణీ

సామాజిక పెన్షన్ల పంపిణీ కార్యక్రమం గురువారం సజావుగా సాగింది. నెల్లిమర్ల, పూసపాటిరేగ మండలాల్లో ఎమ్మెల్యే లోకం నాగమాధవి పాల్గొని లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. అలాగే భోగాపురం మండలంలో కూడా సచివాలయ సిబ్బంది, టీడీపీ నాయకులు పింఛన్లు పంపిణీ చేపట్టారు.

– నెల్లిమర్ల రూరల్/పూసపాటిరేగ/భోగాపురం



నెల్లిమర్ల రూరల్: ఒమ్మిలో వృద్ధురాలికి పింఛన్ సొమ్ము అందిస్తున్న ఎమ్మెల్యే లోకం నాగమాధవి

# మాదకద్రవ్యాల వినియోగంతో జీవితాలు నాశనం

- భోగాపురం సీఐ వెంకటేశ్వరరావు



పాల్గొన్న విద్యార్థులు



మాట్లాడుతున్న భోగాపురం సీఐ వెంకటేశ్వరరావు

డెంకాడ: మాదకద్రవ్యాల వినియోగంతో జీవితాలు నాశనమవుతాయని భోగాపురం సీఐ వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని అక్కివరం పంచాయతీ పరిధి గొల్లపేట వద్ద ఉన్న ఏపీ మోడల్ స్కూల్‌లో అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినం సందర్భంగా గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తమ పిల్లలు అభివృద్ధి చెందాలన్న ఆకాంక్షతో తల్లిదండ్రులు ఎన్నో వ్యయ, ప్రయాసల కోర్చి చదివిస్తున్న విషయం విద్యార్థులు మరువరాదన్నారు. చెడు వ్యసనాల వల్ల వ్యక్తులు చెడిపోవడంతో పాటు వారి కుటుంబాలు కూడా రోడ్డున పడతాయని చెప్పారు. మాదకద్రవ్యాలు సరఫరా చేసినా, వినియోగించినా చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో డెంకాడ ఎస్సై ఎం.కృష్ణమూర్తి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం



పూసపాటిరేగ: వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న వైద్యాధికారి రాజేష్‌వర్మ, తదితరులు

- వైద్యాధికారి రాజేష్‌వర్మ

పూసపాటిరేగ : తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరమని వైద్యాధికారి రాజేష్‌వర్మ అన్నారు. గురువారం స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో తల్లిపాల వారోత్సవాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 7వ తేదీ వరకు వారోత్సవాలు నిర్వహిస్తామన్నారు. ఆస్పత్రుల్లో ప్రసవించిన తల్లులకు బ్రెస్ట్ ఫీడింగ్ కార్నర్, కంగారూ పద్ధతిలో పిల్లలకు పాలిచ్చు విధానంపై అవగాహన కల్పించారు. అనంతరం వారోత్సవాలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ వేదమణి, హెల్త్ ఎడ్యుకేటర్ మహేశ్వరి, సూపర్‌వైజర్ నానమ్మ, ఆరోగ్య సహాయకుడు ఆర్‌వీ రమణ, మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

**అమృతంతో సమానం..**



భోగాపురం: పోలిపల్లి పీహెచ్‌సీ ఆవరణలో నినాదాలు చేస్తున్న ఆర్‌జేడీ చిన్మయిదేవి, వైద్య సిబ్బంది

భోగాపురం: తల్లిపాలు బిడ్డకు అమృతం లాంటిదని ఆర్‌జేడీ చిన్మయిదేవి అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా మండలంలోని పోలిపల్లి పీహెచ్‌సీలో తల్లిపాల ప్రాముఖ్యతపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. పుట్టిన బిడ్డకు గంటలోపు నుంచి ఆరు నెలల వరకు తల్లిపాలు తప్ప మరే ఆహార పదార్థాలు ఇవ్వకూడదన్నారు. తల్లిపాలు తేలికగా జీర్ణమవుతాయన్నారు. నాణ్యమైన ప్రొటీన్లు ఒమెగా 3, 6, 9 బిడ్డ మెదడు వికాసానికి తోడ్పతాయని చెప్పారు. డయేరియా, నిమోనియా వంటి వ్యాధుల నుంచి కూడా బిడ్డలను కాపాడుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి తిరుపతిస్వామి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నాగమణి, అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# మొక్కలతో పర్యావరణ పరిరక్షణ



మొక్కలకు నీరు పోస్తున్న జేఎన్‌టీయూ జీవీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జయసుమ, తదితరులు

విజయనగరం అర్బన్: పర్యావరణ పరిరక్షణకు మొక్కలు శ్రీరామరక్షగా నిలుస్తాయని జేఎన్‌టీయూ జీవీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.జయసుమ అన్నారు. గురువారం స్థానిక జేఎన్‌టీయూ జీవీ ప్రాంగణంలో ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, విద్యార్థులు ప్రతిఒక్కరూ మొక్కలు నాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలని సూచించారు. ముఖ్య అతిథిగా హాజరైన సెంచూరియన్ యూనివర్సిటీ చాన్సలర్ ప్రొఫెసర్ జీఎస్ఎన్ రాజు యూనివర్సిటీ డైరెక్టర్లతో కలిసి జామ, నేరుడు, మామిడి, దానిమ్మ వంటి పలురకాల పండ్ల మొక్కలను నాటారు. కార్యక్రమంలో యూనివర్సిటీ డైరెక్టర్లు ప్రొఫెసర్ ఆర్.రాజేశ్వరరావు, ప్రొఫెసర్ కేసీబీ రావు, ప్రొఫెసర్ కె.బాబులు, ప్రొఫెసర్ కె.కుమార్, ప్రొఫెసర్ గురునాథ్, ఎన్ఎస్ఎస్ యూనివర్సిటీ కో ఆర్డినేటర్ వి.మణికుమార్, ఎన్ఎస్ఎస్ యూనిట్ - 1 పీఓ డాక్టర్ ఎ.వాసులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ వినియోగంపై అవగాహన



డంపింగ్ యార్డు పరిసరాలను పరిశీలిస్తున్న కమిషనర్

విజయనగరం: నగరంలోని పలు ప్రాంతాలలో కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు గురువారం పర్యటించారు. ఆయా ప్రాంతాలలో జరుగుతున్న పనులను పరిశీలించి, సిబ్బందికి తగు సూచనలు ఇచ్చారు. అలాగే ప్లాస్టిక్ వాడకంపై ప్రజలకు అవగాహన కల్పించారు. గంటస్తంభం ప్రాంతంలో పర్యటించి అక్కడ ఉన్న దుకాణదారులకు ప్లాస్టిక్ వాడకం వల్ల జరిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. గంటస్తంభం పరిసరాల్లో జరుగుతున్న కాలువల్లో పూడికతీత పనులను పరిశీలించారు. అలాగే రింగ్ రోడ్డులో ఉన్న డంపింగ్ యార్డ్ ప్రాంతాన్ని పరిశీలించి, వాహనాల రాకపోకల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం పింఛన్ల పంపిణీని పరిశీలించారు.

### నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

విజయనగరం : నగరంలోని పలు ప్రాంతాల్లో చేపట్టనున్న విద్యుత్ లైన్ల నిర్వహణ పనుల్లో భాగంగా శుక్రవారం ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం రెండు వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖాధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డీ సెక్షన్ పరిధిలో ఉన్న కాటవీధి 11 కేవీ ఫీడర్, ద్వారకానగర్ 11 కేవీ ఫీడర్, రింగ్‌రోడ్డు 11 కేవీ ఫీడర్ల పరిధిలో మరమ్మతులు, జంగిల్ క్లియరెన్స్ చేపట్టనున్న నేపథ్యంలో సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.